



అనగనగా ఒక రాజున్నాడు!
ఆ రాజు దగ్గిర నక్కా - పంది కంబారితనాలు కుదిరినాయి! కుదిరితే బక్కలు ఇప్పుడమూ బక్కలు కట్టడమూ గడ్డి కెళ్ళడమూ ఇలాగ... ఒకటేటి అన్ని పనులూ సేసుకుండీవట!
దమ్ముల కాలమొచ్చిందట!
దమ్ముల కాలమొస్తే... ఈ నక్కా పందీ ఏరు పూసుకొని ఏళ్ళీవట... ఎడ్లుని తోలుకొని.
ఎడ్లుకి అక్కడ వదిలీసీదట నక్క.
వదిలీసి ఆ గట్టూ ఈ గట్టూ... ఈ గట్టూ ఆ గట్టూ ఎండ్రికల కోసం తిరుగుతుండీదట.
ఎండ్రికలు దొరికితే తినుకోని గెంతుకోని ఆ బురదలోన దొర్లుకోని - ఇంక బురద వళ్ళుళ్ళా కాకపోతే తోకేమో బురదలో ముంచీసి ఒళ్ళుళ్ళా ఇసురుకుండీదట. ఎడ్లుకీ ఇసిరీసీదట. ఆ ఎడ్లుని మడిలోన తొంగండ బెట్టీసీది. అదొచ్చి సుబ్బరగ ఎండ్రికలు తినుకోని వుండీదట!
పాపమీపంది దానొంతు దీనొంతు ఏరుపూసుకోని - ఆ పొలమంతా దున్నుకోని - అంతేలయిపోతే - పోతులు కడుక్కోని - అది కసిన్ని నీలు పోసుకోని - ఆ పోతులు తోలుకోని - ఇంటికొచ్చి కట్టుకోని - గడ్డి కర్రలవీ పోతులకేసి - తవుడూ ఇంత అంబలీ పెడితే తినుకోని పాపం వుండీదట.
ఈ నక్క ఎడ్లూ కడిగీదీ కాదు. మరొచ్చి నీలూ పోసుకుండీదీ కాదు. రాజు సూసి
'ఓర్నాయనా... పంది పన్జెయ్యడంలేదు... అందుకే అంతారు
పంది... పందిలాగని.
పంది పన్జెయ్యడం లేదు. నక్క సూడు.
ఎంత పని సేసుకోని ఎలాగున్నాదో?!...
ఆ దున్నినదంతా ఈ నక్కే దున్నిందని ఆలు అనుకుంతన్నారు.
ఆ నక్కకి పాలన్నమెట్టోలట!
అయినా ఈ పంది 'అర్రే... నీను పనిసేస్తే నాకు తవుడూ... అంబలి ఎడతన్నారు. దనికి పనీలేదూ పాటూ లేదు దనికి పాలన్నమెడతన్నారు...' అని వుడికీదే కాదట!
పోన్లే ఏదయితే అదేఅయి కడుపు నిండిపోతందని. పాపమా పంది

అనుకుండీదట.

ఒకరోజు రాజు కూతురు మేడ మీద నుండి సూసిందట.

ఈ నక్క పొలాలల్ల గట్టు గట్టూ - గట్టు గట్టూ - గట్టు గట్టూ తిరుక్కోని ఎంద్రికలు తినుకోని వున్నాదట. ఈ ఎడ్లుని తొంగండబెట్టేసిందట మడిలోన. పాపమీ పందొక్కదాయి ఏరు పట్టుకోని దున్నుకుంతందాట.


అయితే, తండ్రికి పిలిసిందాట.

'నాన్న... రా' అని!

పరిగెట్టి పరిగెట్టి మేడ దిగిందాట. తండ్రి దగ్గిరికి ఎల్లిందాట. సూసింది సెప్పిందాట. పందే పనిసేస్తంది. నక్క సూడు ఏటి సేస్తంది? అని మేడ మీదకి తీసుకెళ్ళి సూపించిందట.

ఈ నక్కేమో సుబ్బరంగ గెంతుతంది కదా... ఈ పంది దున్నుకుంతంది. 'అన్నా దినిదిలగ... దని దలగ... అది పోసుకోని సేసుకోని నున్నగొచ్చీది. ఇది పొర్లుకోని దొర్లుకోని ఇలాగొచ్చీది... బురదతోటి! ఇలాటి వేషాలా? అందుకే నక్క పోతు సిన్నెలని అంటారు... అనుకోని ఆ పొద్దు ఏటి సేసినారూ?! నక్కకి తవుడూ అంబలి ఎట్టారు. ఈ పందికొచ్చి పాలన్నమెట్టారు. పాలన్నమెడితే-


'అన్నా- నీను పని సెయ్యలేదని ఈ పంది సెప్పకపోతే... ఆలకి ఎలగ తెలుసును? ఆలెవులు పొలము దుక్కురాలేదు... ఇది సెప్పంటాది అందుకే నాకు అంబలీ, తవుడు ఎట్టారు. పందికి పాలన్నమెట్టారు. దీని పని సెప్తాను... ఇలాక్కాదు....' అనుకోని నక్క దని మీద కుళ్ళుతనం కాసింది!



ఉక్రోషమైపోయి ఈ నక్క ఏటి సేసిందీ?

'నేస్తమూ... నేస్తమూ... మరి మన మీవేళ బేగి ఎల్దుమా? సెరుకు

గుడ్డిల్లోన సెంగల గడ్డి వున్నాది... నువ్వు వస్తావేటి?' అని నక్క పందిని అడిగింది.



'లేదండీ... ఎక్కడో గంపడు తెచ్చి... నా పోతులకి ఏసుకుంతాను.. ఎల్లండి మీరు...' అన్నాదట పంది.

'లేదండీ నేస్తమూ గొప్ప ఘనమైన గడ్డి... సెంగల గడ్డి వున్నాది... రాయండి' అన్నాదట నక్క. సెయ్యెత్తు పొడవు తోటి పువ్వులతోటి నిగనిగలతోటి ఏటాగడ్డి... అని సెంగల గడ్డిని నక్క వర్ణించడం మొదలు పెట్టింది.


'నీను రాను' అని పంది అనిస్తే - ఎన్ని లబ్జులో ఎన్ని మాటలో ఆడి తీసికెళ్ళింది నక్క. పాపం పంది మెత్తబడిపోయింది. ఎనక ఎళ్ళింది. గంపడేసి గడ్డి కోసినారట!

రొండు సెరుకు గుడ్డిల మద్దిని ఒక నుయ్యి వున్నాదట. అక్కడికి సేరినాయట.

'నేస్తమూ... నేస్తమూ... మరేమొచ్చి మనమొక పందిమేతుమూ. ఈ నుయ్యి ఇవతల గట్టు నుండి అవతలి గట్టుకి ఎవులు గెంతితే - ఆలదే నండి గడ్డి. నువ్వు గానీ గెంతితే నా గడ్డి నీకు ఇచ్చేస్తానండి... లేదంటే... నీను గాని గెంతితే నాకు ఇచ్చియ్యండి' అన్నాదట నక్క.

'నాకా పందేలేటి వద్దండి నేస్తమూ... నీనెలిపోతాను.. నా బక్కలకి గడ్డికర్రల్లేవు... ఎందుకు నీనెలిపోతాను' పంది అంటే-

'లేదండి నేస్తమూ... రాయండి నేస్తమూ... నీకు రొండు మానిల గడ్డొస్తాది. ఇవతల నుండి అవతలకి గెంతీడానికి ఏటున్నాది? నేస్తమూ ఒట్టిన కాదండీ ఇదిగో ఈ తిరవలి పాపి... ఏటి? ఈ రాయి వున్నాది కదా... ఈ రాయిని మీరు మెడకి కట్టుకోయండి... ఈ పిడకున్నాది... ఈ పిడక



నీను మెడకి కట్టుకుంతాను. నీను బరువెత్తలేను కదండీ... సన్నము... నాకు పిడకండి... మీరు వలముటోలు కదా... కొద్దిగ శక్తిమంతులు కదా... మీకీ రాయండి...' అన్నాదట.

తిరవలి పాపి కన్నంలెల్లి తాడేసి పందికి కట్టీసింది. పిడకముక్కకి కన్నమెట్టీసి నక్క కట్టుకుంది.

దానికి రాయి... దీనికి పిడక...

మొదలే పంది బరువు. దనికితోడు తిరవలి పాపయితే అది అవుతాదే?

ఈలోగ... ముందల నక్క గెంతీసింది. ఆ ఒడ్డు నుండి ఈ ఒడ్డుకి. సులకన కదా... గెంతీసింది.

'మీరూ గెంతండి నేస్తమూ' అంటే పంది గెంతలేపే. గెంతలేపోయి ఆ నూతిల బడిపే!

ఈరొండు మాణిల గడ్డి ఈ నక్క అడుసుకుంది. అడుసుకోని వచ్చీసీ. వచ్చీసి వూర్లోన కీకలేసిందట.

'రాయండేఁ... పందేమో నూతిల పడిపోయింది'

పాపము పనోలూ ఈలూ ఆలూ వచ్చినారు. పందికి తీసినారు. పంది సచ్చింది!

సచ్చిపోయింది కదా... ఆ పందిని కూరకి తయారు సేసుకోవడానికి కాలుస్తన్నారు. కాల్చీసి ముక్కలు కొట్టిన సమయానికి - సిన్న అగ్గినిప్పు ఎక్కడ తెచ్చిందో నక్క? కాల్చిన దగ్గిర నుండి ఆలుసూడకుండ పట్టికెల్ళి... రాజుగోరి గడ్డికుప్పకి తగిలించీసింది!

ఇన్నావా?



రాజుగోరి గడ్డికుప్పకి అగ్గి తగిలించీడం తోటి ఇంకేటి రాజుకుంది. రాజుకుండీ సరికి 'ఓరినాయిన రాజుగోరి గడ్డికుప్ప కాలిపోతంది' అని ఈ నక్కే కేకేసింది.

ఇకన పనోలాలు మాంసంకి సూస్తారేటి! గడ్డి కాలిపోతే రాజు వుస్తాడా? అది ఆర్పడానికి పారిపోనారు. అందలోన ఒక సట్ట పట్టుకుందీ నక్క. సట్ట పట్టుకోని తిన్నగ-

'నంద నూతిల పంది పడ్డాది జజ్జనకడి... జజ్జినకడి'

అనుకోని పాడుకోని ఎలిపోతందీ నక్క. సట్ట పట్టుకోని... గెంతు లేసుకోని. అలాగెక్కడి కెళ్ళిందీ? కుమ్మరోడి దగ్గిరికెళ్ళింది. ఎళ్ళి 'కుమ్మరన్నా కుమ్మరన్నా... నీకీ మాంసము సట్టిస్తాను. నాకొక కుండ ఇస్తావా?' అన్నాదట నక్క. అయితే ఆ కుమ్మరోడు ఆ సట్ట తీసుకోని కుండ ఇచ్చాడట.

**'సట్టాపోయి కుండా వచ్చె జజ్జనకడి... జజ్జినకడి'**

అని పాడుకోని ఎల్తందట నక్క.

ఆ తోవల రాజుగోరి పువ్వల సెట్టులకి నీలు మోస్తన్నారట పనోలు. అంచులిరిగిపోయిన కుండలతోటి. బొక్కి కుండలతోటి.

'అలాగేటి మోస్తన్నారు... ఎప్పుడుకి తోట నీలుతోటి తడుపుతారు?' ఇక్కడే కారిపోతన్నాయి. ఈ కుండతోటి పొయ్యండ'ని కుండ ఇచ్చిందట నక్క.

ఆ కుండిస్తే - ఆ కుండ నాని బడక్కన బద్దలయిపె. బద్దలయిపోదా? కుమ్మరోడు దీని బాధ పడలేక ఇచ్చినాడు గాని...

కుండ బద్దలయి పోయీసరికి నక్క ఏటిసేసిందీ?

'నాకు కుండిస్తారా? దండిస్తారా?' అని పెట్టిందట.

ఏటిసేస్తారూ? పాపమాలు ఇన్ని పువ్వులు ఏరి దండగుప్పి దానికి ఇచ్చారట.

**'కుండాపోయి దండా వచ్చె జజ్జనకడి... జజ్జినకడి'**

అని పాడుకోని ఎల్తందట నక్క.

ఆ తోవల ఈటె దాయేమో గెడమీద ఆడుతందట.

'ఏహేఁ ఏటలగ ఆడుతన్నావు? నీకసలు పువ్వులుంటే అందము.

పువ్వులు లేకపోతే నీకేమందము?' అనీసి ఈ నక్క అన్నాదట. అలగనీసరికి ఆ ఈటిదాయి ఆ పువ్వుల దండ పెట్టుకున్నాదట.

పువ్వులు పెట్టుకుంతోటికి - ఆడి... గెడ మీద బొడ్డుమోపి గిర్రున తిరుగుతంది. ఆ తిరిగినలోన ఆ పువ్వులన్ని ఎటువటు ఈడిపోయినాయి! ఈడిపోయెలిపోయినాయి!

దండ ఈడిపోయీసరికి నక్క ఏటి సేసిందీ?

'నాకు దండిస్తారా? ఢంకిస్తారా' అని పెట్టిందట.

ఏటిసేస్తారూ? పాపమాలు ఢంకా ఇచ్చారట!

'దండా పోయి ఢంకా వచ్చె జజ్జనకడి... జజ్జినకడి' అని పాడుకోని ఎల్తందట నక్క.
ఎలాగెల్తందీ? ఎలగ రాగం తీస్తందీ?
**"నంద నూతిల పంది పడ్డాది జజ్జనకడి... జజ్జినకడి.**
**సట్టాపోయి కుండా వచ్చె జజ్జనకడి... జజ్జినకడి**
**కుండా పోయి దండా వచ్చె జజ్జనకడి... జజ్జినకడి**
**దండాపోయి ఢంకా వచ్చె జజ్జనకడి... జజ్జినకడి..."** అని పాడుకోని గెంతుకోని వస్తందట నక్క.
అందరూ జడిసిపోయి వూరిల తలుపులేసుకున్నారట!?
ఒక ముసిలోడు సుట్ట కాల్సుకోని గడపల కూసున్నాడట. అయితే-
'నన్ను సూసి అందరు ఎలిపోతుంతే... నువ్వొచ్చి ఎర్రగ సుట్ట కాల్సుకోని కూకుంతావా?' అనుకోని ఆ ముసిలోడికి ఒక్క లెంపకాయ లాగింది! లెంపకాయ కొడతోటికి పాపమా ముసిలోడు పడిపోనాడట!
'... దీనికి ఇలక్కాదు... బాగ బలిసిపోయి కొవ్వు పట్టీసింది... లేపోతే బంగారం లాటి పందిని సంపీసింది. అన్నెం పున్నెం ఎరగని ముసిలోడికి కొట్టీసింది...' అనుకోని ఒక లక్కబొమ్మకి సేసినారట. బొమ్మని గడపలోన కూసోబెట్టి... ఎర్రగ సుట్టకాల్సి ఆ బొమ్మ సేతిల ఎట్టీసి వుంచారట. వుంచీసరి కటమ్మా ఏటయ్యిందీ? ఈ నక్క వచ్చింది. సూసింది. 'అందరు నన్ను సూసి తలుపు లేసుకుంటే జడిసిపోయి... నీకు బయ్యంలేదా?' అని ఎండలోన వున్న లక్కబొమ్మకి - ఈ ముసిలోడికి కొట్టినట్టే ఒక్క లెంపకాయ కొట్టిందట. ఎండకి లక్క కరిగున్నాది కదా... కొడతోటికి ఈ నక్కకి సెయ్యి అంటీసిందట. ఈ సెయ్యితో కొడితే ఈసెయ్యా అంటీసిందట. కాలుతోటి లాగిందట... గుండె మీద సెయ్యేసి... కాలేసి... ఆ కాలూ అంటీసింది. జనమందరు వచ్చినారు. కదల్లేక దొరికిపోయింది. దొరికిపోతోటికి సుబ్బరగ గుండగ సితక్కొట్టి దాన్ని సంపేనారు! నక్క పీడ వదిలింది అనుకున్నారా వూరోళ్ళు.
రాజు మరక ఇద్దరు కంబారుల్ని పెట్టుకున్నాడు. 'కష్టపడిన పంది... బంగారంలాటి పందిని సంపేనారు' అని రాజు ఇసారించినాడు! మరేటి!?

